## క్లుప్తంగా

### తీరిన విద్యుత్ సమస్య



దరోగపల్లి కొలావార్ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెంచికల్‌పేట్: మండలంలోని దరోగపల్లి గ్రామంలోని కొలావార్ కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు రెండు రోజులు క్రితం తహసీల్దార్ తిరుపతికి వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలో శుక్రవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సమస్యపై స్పందించిన అధికారులకు కాలనీవాసులు ధన్యవాదాలు తెలియజేశారు.

### పాఠాలు బోధించిన ఎస్సై



పాఠాలు బోధిస్తున్న ఎస్సై అనిల్‌కుమార్

పెంచికల్‌పేట్: మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్సై అనిల్‌కుమార్ విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులను తరగతుల వారీగా ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభకు కొదువ లేదని, ఉపాధ్యాయులు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఉపాధ్యాయులు రమాకాంత్ తదితరులు ఉన్నారు.

### 24న మున్నూరుకాపు సంఘం కార్యవర్గం ఎన్నిక

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో ఈ నెల 24న మున్నూరు కాపు సంఘం తాలూకా కమిటీ ఎన్నిక నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకులు పోలంపెల్లి గణపతి తెలిపారు. తాలూకా కమిటీతో పాటు మండల యూత్ అడ్‌హాక్ కమిటీలను వేస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ‘పెండింగ్ రోడ్డు పనులు పూర్తి చేయాలి’



సర్వీసురోడ్డు లేని ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రెబ్బెన: జాతీయ రహదారిపై పెండింగ్‌లో ఉన్న పనులతో పాటు పూర్తిస్థాయిలో సర్వీసు రోడ్లు నిర్మించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మల్రాజు రాంబాబు పేర్కొన్నారు. మంచిర్యాల టూ మహారాష్ట్ర సరిహద్దు వరకు నిర్మించిన జాతీయ రహదారి 363లో పెండింగ్‌లో ఉన్న సర్వీసు రోడ్లు, సెంట్రల్ లైటింగ్, బస్టాండ్‌ల నిర్మాణాలు, సైడ్ డ్రెయిన్‌లను పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను విన్నవించగా, నేషనల్ హైవే అధికారులు పెండింగ్‌లో ఉన్న సైడ్ డ్రైన్, సర్వీసు రోడ్లు తదితరుల పనులను బీజేపీ మండల అధ్యక్షుడితో కలిసి శుక్రవారం పరిశీలించారు.

### జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

దహెగాం: మండలంలోని చినరాస్పెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సునీత శుక్రవారం తెలిపారు. ఇటీవల ఆసిఫాబాద్ పీటీజీ గర్ల్స్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 విభాగంలో 9వ తరగతి విద్యార్థినులు ఎల్కరి రాజేశ్వరీ, సాపిల అంజలి, 8 వ తరగతి విద్యార్థినులు పాలె శ్రీవాణి, లాట్కరి సింధు ప్రియ, అండర్ 17 విభాగంలో 10వ తరగతి విద్యార్థినులు ఎల్కరి రాజేశ్వరీ, 9వ తరగతి విద్యార్థినులు పాలె అంజలి, లాట్కరి హిమబిందులు జోనల్‌స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కాగా సిబ్బంది అభినందించారు.

### వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

కాగజ్‌నగర్‌రూరల్: రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని ఏవో రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని భట్టుపల్లి గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల సాగులో నాణ్యమైన విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవో సృజన పాల్గొన్నారు.

## పార్కులో కొరవడిన నిర్వహణ



ఓపెన్‌జిమ్‌లో విరిగిన హ్యాండిల్

పార్కు ఆవరణలో పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు



పార్కులో జిమ్ చేస్తున్న వాకర్స్



పార్కులో యోగాసనాలు వేస్తున్న వాకర్స్



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కొట్నాక భీమ్‌రావు పిల్లల పార్కులో నిర్వహణ కొరవడింది. ఇటీవల కురిసిన వర్షాలకు పార్కు ఆవరణలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. పార్కు చుట్టూ వాకింగ్‌ట్రాక్ బార్డర్‌పై గడ్డి, పిచ్చి మొక్కలు పెరిగి ప్రమాదకరంగా మారాయి. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పార్కు అస్తవ్యస్తంగా మారింది. గడ్డి, పిచ్చి మొక్కలతో పార్కులో విషసర్పాలు సంచరిస్తున్నాయి. పార్కులోని ఓపెన్‌జిమ్ పరికరాలు కొన్ని పని చేయడం లేదు. కొన్ని పరికరాలు విరిగిపోగా, మరి కొన్ని సక్రమంగా పని చేయక ప్రమాదకరంగా మారాయి. జిమ్ ప్రాంతంలో కనీసం చెత్తాచెదారం ఊడ్చే వారు లేరని వాకర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీరోజు ఉదయం సీనియర్ సిటిజన్లు, యువకులు, మహిళలతో పాటు విద్యార్థులు సుమారు 200 మందికి పైగా వాకర్లు పార్కులో మార్నింగ్ వాక్‌కు వస్తుంటారు. గతంలో అప్పటి అదనపు కలెక్టర్ వరుణ్ రెడ్డి పార్కుపై ప్రత్యేక శ్రద్ధ వహించగా, ప్రస్తుతం అధికారులు పార్కు నిర్వహణను పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సంబంధిత అధికారులు పార్కులో పిచ్చి మొక్కలు తొలగించి, ఓపెన్‌జిమ్ పరికరాలకు మరమ్మతులు చేపట్టాలని వాకర్లు కోరుతున్నారు.

# వాతావరణ మార్పులతో జ్వరాలు

- దగ్గు, ఒళ్లు నొప్పులతో ఇబ్బందులు
- ఆసుపత్రులకు క్యూకడుతున్న రోగులు
- జాగ్రత్తలు పాటించాలని వైద్యుల సూచన



కాగజ్‌నగర్ పట్టణంలోని సీహెచ్‌సీలో రోగులు

కాగజ్‌నగర్‌టౌన్: వాతావరణ మార్పులతో ఫ్లూ వైరస్ విజృంభిస్తోంది. దగ్గు, జ్వరాలు దడ పుట్టిస్తున్నాయి. దగ్గుతో పాటు రోజుల తరబడి తగ్గని జ్వరాలతో రోగులు ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా చేసుకుంటూ కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటే జ్వరాలు, దగ్గు భారీ నుంచి ఉపశమనం పొందచ్చని అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. పట్టణంలోని నౌగాంబస్తీ, సర్‌సిల్క్, ద్వారకానగర్, సంజీవయ్య కాలనీ, కాపువాడ, గాంధీనగర్, శ్రీరాంనగర్ కాలనీల్లో కొద్దిరోజులుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. సాధారణ వైరల్ ఫీవర్‌కు భిన్నంగా దగ్గు, జ్వరం, తలనొప్పి, కాళ్లు చేతుల నొప్పులు తగ్గకపోవడంతో బాధితులు అల్లాడిపోతున్నారు. వాతావరణ మార్పులకు జ్వరాల తీవ్రత పెరిగింది. టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాలు అధికమై రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక సీహెచ్‌సీతో పాటు ప్రైవేటు ఆసుపత్రుల వద్ద రోగులు క్యూ కడుతున్నారు.

**శుక్రవారం.. డ్రైడే**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని అధికారులు చెబుతున్నారు. ఇంటిలో నీటి నిల్వలు చేస్తున్న పాత్రలను ప్రతీ శుక్రవారం శుభ్రం చేసి ఆరబెట్టాలి. ఫ్రిడ్జ్ వంటి ఎలక్ట్రిక్ పరికరాలలో నీటిని ల్వలను కూడా తొలగించాలని, వాష్‌రూమ్‌లను శుభ్రం చేసుకోవాలని పేర్కొంటున్నారు. ఇంటి బయట ఎటువంటి వ్యర్థాలు లేకుండా చూసుకోవడంతో పాటు కుండీలు, మట్టి పాత్రలు ప్లాస్టిక్ పరికరాలలో నిల్వ నీరు, తాగిన కొబ్బరి బొండాల్లో నీరు చేరడం, టైర్లలో నీరు లేకుండా దృష్టి పెట్టి శుభ్రం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

**జ్వరాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు..**

- జ్వరం, దగ్గు వంటి ఫ్లూ లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యంపైన, మందుల షాపులపైన ఆధారపడకుండా వైద్యులను సంప్రదించాలి.
- వీలైనంత విశ్రాంతి తీసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. మాస్క్ ధరించాలి.
- యాంటీబయాటిక్ మందులు, దగ్గు సిరప్‌లు వాడకుండా, వైద్యులు సూచించిన మందులనే వినియోగించాలి.
- దుమ్ము, ధూళి, పొగ ఉండే ప్రాంతాలకు దూరంగా ఉండాలి.
- అస్తమా, షుగర్ వ్యాధి ఉన్న వాళ్లు దగ్గు తీవ్రత పెరుగుతున్నట్లు అనిపించినా, శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తినా వెంటనే వైద్యులను సంప్రదించాలి.

**జ్వరాలు విజృంభించకుండా చర్యలు**



ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. ప్రతీరోజు 250 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తున్నాం. వాతావరణ మార్పుల వల్ల ఫ్లూ, వైరల్ జ్వరాలు వస్తున్నాయి. ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. శుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలి.

– అవినాశ్ కుమార్, సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, కాగజ్‌నగర్

## నేరాల నియంత్రణకు ‘కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం’



సింగల్‌గూడలో మాట్లాడుతున్న సీఐ సంజయ్

రెబ్బెన: నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని సీఐ సంజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సింగల్‌గూడలో ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. గ్రామంలోని ప్రతీ ఇంటిలో తనిఖీలు నిర్వహించగా రెండు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో సరైన పత్రాలు లేని 15 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయి, గుడుంబా, రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పనట్లు తెలిస్తే వెంటనే డయల్ 100ను సంప్రదించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు, నేరాల నియంత్రణ కోసం జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. రెబ్బెన ఎస్సై వెంకటకృష్ణ, తిర్యాణి ఎస్సై వెంకటేశ్ పాల్గొన్నారు.

# ముందస్తు బతుకమ్మ వేడుకలు



రెబ్బెన: బతుకమ్మలతో అధ్యాపకులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బాలికల గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. డీటీడీవో రమాదేవి, జీసీడీవో శకుంతల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలతో బతుకమ్మను తయారు చేసి పాఠశాల ఆవరణలో బతుకమ్మ ఆడారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..**

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి మాట్లాడుతూ తెలంగాణలో పూల పండుగ బతుకమ్మ అని, రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి ఆడపడుచులు జరుపుకునే పండుగ బతుకమ్మ అని అన్నారు.

**మోడీ ఆశ్రమంలో..**

కెరమెరి: మండలంలోని మోడీ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. శనివారం నుంచి పక్షం రోజులు విజయదశమి ఉత్సవాల నేపథ్యంలో ఒకరోజు ముందే బతుకమ్మ జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మ తయారు చేశారు. బతుకమ్మ పాటలపై చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. డీడీ రమాదేవి టీచర్లతో కలిసి స్టెప్పులేశారు. ప్రధానోపాధ్యాయుడు ప్రేందాస్ తదితరులు ఉన్నారు.



కెరమెరిలో..

**గంగాపూర్ కేజీబీవీలో..**

రెబ్బెన: మండలంలోని గంగాపూర్‌లో గల కస్తూరిబా గాంధీ విద్యాలయంలో శుక్రవారం అధ్యాపకులు, విద్యార్థినులు ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారుచేసి పాఠశాల ఆవరణలో పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ ఉత్సాహంగా గడిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని విద్యార్థులందరికీ బతుకమ్మ పండుగ ప్రాముఖ్యత తెలియజేసేలా ముందస్తు సంబరాలు నిర్వహించినట్లు ఎస్‌వో పద్మ తెలిపారు.

## ఉపాధ్యాయులు ఆదర్శంగా ఉండాలి



సన్మానిస్తున్న ఎంఈవో రమేశ్‌బాబు

పెంచికల్‌పేట్: ఉపాధ్యాయులు సమాజంలో ఆదర్శంగా నిలవాలని ఎంఈవో రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని ఎల్కపల్లి రైతు వేదికలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గోపాల్ రెడ్డి (హెచ్‌ఎం), గంగాభవాని(ఎస్ఏ), ఈశ్వర్‌రావు (ఎస్ఏ), కవిత (ఎస్‌వో కేజీబీవీ), భగవంతరావు (ఎస్‌జీటీ), సుజాత (పీఎస్, హెచ్‌ఎం), ఎం. ప్రియాంక (ఎస్‌జీటీ) సన్మానించారు. కార్యక్రమంలో పెంచికల్‌పేట్ కాంప్లెక్స్ హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కెరమెరి: విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని అభినందిస్తూ మండలంలోని చిన్నసాకడ గ్రామానికి చెందిన ఆదివాసీలు శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఎస్సీఆర్‌పీ చహకటి శ్యాంరావు, సాకడ పాఠశాల సీఆర్టీ కే.సుజాతను శాలువాతో సత్కరించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ జిల్లాస్థాయిలో శ్యాంరావు, మండల స్థాయిలో సుజాత ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడం అభినందనీయమన్నారు. మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం, గ్రామపటేల్ పెందోర్ దంబిరావు, నాయకులు పెందోర్ ఆనంద్‌రావు, సెడ్మకి తుకారాం, పెందోర్ శ్రీనివాస్, మడావి సోము, భుజంగ్‌రావు, రాంశావ్, గుణవంత్‌రావు, నాగోరావు, ఇస్రు తదితరులు ఉన్నారు.

### ఈపీ ఆపరేటర్ల సంబరాలు



స్వీట్లు తినిపించుకుంటున్న నాయకులు

రెబ్బెన: గత కొన్ని సంవత్సరాలుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న ఈపీ ఆపరేటర్లకు ప్రమోషన్లు కల్పించడంతో శుక్రవారం ఖైరిగూర ఓసీపీలో ఈపీ ఆపరేటర్లు సంబరాలు చేసుకున్నారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి ఖైరిగూర ఓసీపీ సందర్శించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రమోషన్లు దక్కేలా కృషి చేసిన ఏఐటీయూసీ నాయకులకు ఈపీ ఆపరేటర్లు స్వీటు తినిపించగా, ఏఐటీయూసీ నాయకులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఫిట్ కార్యదర్శి శ్రీనివాస్, బ్రాంచి ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేశ్, చంద్రశేఖర్, షిఫ్ట్ ఇన్‌చార్జి అంజయ్య, వెంకటేశ్, సత్యనారాయణ, గణేశ్, నరేశ్, తిరుమలేష్ పాల్గొన్నారు.

### సీఐకి సన్మానం



సన్మానిస్తున్న మాలీ సంఘం నాయకులు

కౌటాల: కౌటాల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం మాలి సంఘం నాయకులు సీఐగా బాధ్యతలు స్వీకరించిన సంతోష్‌కుమార్‌ను శాలువాతో సన్మానించారు. సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదే నాందేవ్, నాయకులు గంగారాం, శ్రీనివాస్, జ్యోతిరావ్, మోర్లె పాండురంగ్, సంతోష్, చందు తదితరులు పాల్గొన్నారు.

### మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

తిర్యాణి: గుడుంబా, గంజాయి వంటి మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రమేశ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతలమాదర, పంగిడి, సుంగాపూర్, తలండి, తిర్యాణి, గంభీరావుపేట గ్రామాల్లో పర్యటించారు. అనంతరం గంజాయి, నాటుసారా వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ కమలాకర్, తిరుమల తదితరులు ఉన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఎమ్మెల్యే సంఘీభావం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌టౌన్: వేతనాలు చెల్లించాలని ఐదు రోజులుగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో సమ్మె చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం ఎమ్మెల్యే హరీశ్‌బాబు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని, ఇదే విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించినా పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి చొరవ తీసుకుని ఆర్థికశాఖ నిధుల నుంచి వేతనాలు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు శంకర్, కార్మికులు సంజీవ్, ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

## యూరియా పంపిణీ కేంద్రం వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న పాల్వాయి యువ సైన్యం సభ్యులు

పెంచికల్‌పేట్: మండలంలోని అగర్‌గూడ గ్రామంలోని యూరియా పంపిణీ కేంద్రం వద్ద శుక్రవారం పాల్వాయి యువసైన్యం ఆధ్వర్యంలో యూరియా కోసం వచ్చిన రైతులకు అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ రైతులు యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మారుమూల గ్రామాల రైతులకు ఎమ్మెల్యే హరీశ్‌బాబు చొరవతో యూరియా పంపిణీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు పాలె సంతోష్, యువకులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

**ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి**

ఆసిఫాబాద్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి మాట్లాడుతూ జిల్లాలో ఉపాధ్యాయులు కుటుంబ సర్వే నిర్వహించారని, ఐదు రోజులు సెలవు దినాలలో విధులు నిర్వహించిన కారణంగా సీసీఎస్ కోసం కోసం ఎంపీడీవోలు డ్యూటీ సర్టిఫికెట్ ఇచ్చేందుకు ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. సంఘం నాయకులు మహేశ్, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి**

బెజ్జూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని ఎంఈవో డాక్టర్ సునీత అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శుక్రవారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.

**విద్యార్థుల వివరాలు నమోదు చేయాలి**

ఆసిఫాబాద్‌రూరల్: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వివరాలను నమోదు చేయాలని జిల్లా సైన్స్ అధికారి మధుకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు విలీన విద్యారిసోర్స్ పర్సన్ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులను ఎన్‌టైటిల్మెంట్స్ పొందడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. శిక్షణ రిసోర్స్ పర్సన్ చంద్రశేఖర్, స్రవంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**‘మీడియా స్వేచ్ఛను హరించడం సిగ్గుచేటు’**

ఆసిఫాబాద్‌అర్బన్: మీడియా స్వేచ్ఛను హరించడం సిగ్గుచేటని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ మండిపడ్డారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జీజీహెచ్ ఆసుపత్రిలో మీడియాపై విధించిన ఆంక్షలు మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనన్నారు. ఆసుపత్రిలో ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని, జర్నలిస్టుల ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 22న ఉదయం 11 గంటల నుంచి కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వెల్లడించారు.

రెబ్బెన: ప్రభుత్వ ఆసుపత్రిలో మీడియాపై విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ తెలిపారు.

చింతలమానెపల్లి: జీజీహెచ్ ఆసుపత్రిలో మీడియాపై విధించిన ఆంక్షలు మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించడమేనని సంఘం ఉపాధ్యక్షుడు నవీన్ గౌడ్ అన్నారు.

### ‘పీఎం జుగా’తో మౌలిక సదుపాయాలు



మాట్లాడుతున్న డీడీ రమాదేవి

కెరమెరి: ప్రధానమంత్రి జన జాతీయ ఉత్కర్ష గ్రామీణ అభియాన్ (పీఎం జుగా) పథకంలో గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు డీడీ రమాదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని సాకడ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడారు. జిల్లాలోని 102 గ్రామాల్లో వివిధ రకాల సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవో అంజద్‌పాషా, ఎఫ్ఆర్‌వో మజారోద్దిన్, ఎస్సీఆర్‌పీ శ్యాంరావు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎం, ఆశలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.